7

సాక్షి
మెదక్

గురువారం । 3 । జూలై । 2025


పరిశ్రమ శిథిలాలను బయటకు తీసుకెళ్తున్న రెస్క్యూ టీం సిబ్బంది

దక్కని ఆఖరి చూపు..
ఆగని కన్నీళ్లు


పరిశ్రమ ఎదుట మంత్రి దామోదర కారును అడ్డగిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

అయినవారి కోసం కుటుంబసభ్యుల పడిగాపులు

మూడు రోజులుగా నరకయాతన ● 'సిగాచీ' పేలుడు మిగిల్చిన పెనువిషాదం

అయినవారి కోసం ఆర్తనాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సిగాచీ పరిశ్రమ ఎదుట బాధిత కుటుంబసభ్యులు పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపు దక్కక.. అంతిమ సంస్కారాలు సాగక దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. కనిపించిన వారినంతా.. 'అయ్యా.. మా వాళ్లు ఏరీ? అంటూ దీనంగా వేడుకుంటున్నారు. ఈ పేలుడు ఘటన మిగిల్చిన విషాదం మూడు రోజులుగా కొనసాగుతుండటంతో బాధిత కుటుంబసభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉపాధి కోసం వందల కిలోమీటర్ల దూరం నుంచి పొట్ట చేతపట్టుకుని వస్తే.. ఉపాధి దేవుడెరుగు.. ఉసురు పోయిందని బాధితులు కన్నీరు మున్నీరవుతుండటం అందరినీ కలిచివేస్తోంది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

కుటుంబసభ్యులు మరణిస్తే వేదన అంతా ఇంతా కాదు.. మరణించాడని తెలిసి చివరి చూపు కోసం.. అంతిమ సంస్కారాలైనా చేసుకుందామంటే మృతదేహం లభించకపోతే.. ఆ శోకం రెట్టింపవుతుంది. సరిగ్గా ఇలాంటి ఆవేదనే సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలు అనుభవిస్తున్నాయి. తమ వారి జాడ చెప్పాలని, లేదంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని వారి కుటుంబసభ్యులు పడుతున్న యాతన అందరినీ కలిచివేస్తోంది. ఘటన జరిగిన సిగాచీ పరిశ్రమ వద్దకు తరలివస్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు.. తమ వారి ఆచూకీ కోసం అక్కడ ఉన్న అధికారులను వేడుకుంటున్నారు. హెల్ప్‌డెస్క్‌కు వెళ్లి ఆరా తీస్తున్నారు. మృతదేహాలను ఉంచిన పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద అధికారులను సంప్రదిస్తున్నారు. గంటలు కాదు.. రోజులు గడుస్తున్నా తమ వారు కనిపించకపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు.


భర్త మృతదేహం కోసం నిరీక్షణ


కంపెనీ వద్ద రోదిస్తున్న బాధితురాలు


ఐలా భవన్‌లో బాధిత చిన్నారులు

క్యాంపులో బిక్కుమంటూ..

బాధిత కుటుంబాల కోసం అధికారులు పాశమైలారం ఐలా కార్యాలయం వద్ద ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమ వారి ఆచూకీ కోసం అక్కడి హెల్ప్‌డెస్క్‌లో రక్త నమూనాలను ఇచ్చి తమ వారి మృతదేహాల కోసం వేచి చూస్తున్నారు. అధికారుల నుంచి ఎప్పుడు పిలుపు వస్తుందోనని ఆవేదనతో వేచి చూస్తున్నారు. ఆచూకీ తెలియగానే సమాచారం ఇస్తామని అధికారులు దాటవేస్తుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.




మృతుల కుటుంబాలకు నచ్చజెబుతున్న అధికారి


హెల్ప్ డెస్క్ వద్ద వివరాలు చెబుతున్న సిబ్బంది

స్నేహితుడి ఆచూకీ కోసం..


దీపక్ కోసం పరిశ్రమ వద్దకు వచ్చిన స్నేహితులు

పొట్టచేతపట్టుకుని ఉపాధి కోసం ఒడిశా నుంచి పటాన్‌చెరుకు వచ్చారు 28 సంవత్సరాల దీపక్. తన స్నేహితులతో కలిసి ఇస్నాపూర్‌లోని ఓ గదిని అద్దెకుంటున్నాడు. మూగ్గురు మూడు కంపెనీల్లో పనిచేసుకుంటున్నారు. మూడు నెలల క్రితమే దీపక్ ఈ సిగాచీ పరిశ్రమలో చేరారు. సోమవారం ఉదయమే పనికి వెళ్లిన దీపక్ ఆచూకీ లేకుండా పోయింది. దీంతో ఒక్కడే ఇక్కడ ఉండటంతో ఆయనకు సంబంధించిన కుటుంబసభ్యులు ఎవరూ ఇక్కడ లేరు. దీపక్‌తో పాటు అద్దె గదిలో ఉంటున్న తన స్నేహితులు సునాముద్దీన్, బవుజీలు ఇతర స్నేహితులు ఇప్పుడు దీపక్ ఆచూకీ కోసం పరిశ్రమ వద్దకు వచ్చి అధికారుల వద్ద గోడు వెల్లబోసుకున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి అడిగితే అధికారుల నుంచి స్పందన లేదని సునాముద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు

- అందుబాటులో హెల్ప్‌డెస్క్
- కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు టౌన్: పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రిస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నామన్నారు. బాధిత కుటుంబాల కోసం ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. బాధితులు వారివారి స్వగ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేశామన్నారు. ఒడిశా, బిహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారన్నారు.

18 మృతదేహాలు అప్పగింత

ఇప్పటి వరకు 18 మంది మృతదేహాలను అప్పగించామని కలెక్టర్ తెలిపారు. డీఎన్ఏ ఫలితాల కోసం 18 నమూనాలు పెండింగ్‌లో ఉండగా, ఇంకా సేకరించాల్సిన రెండు మృతదేహాల నమూనాలు ఉన్నాయని తెలిపారు. డీఎన్ఏ ద్వారా ఐదుగురు నమూనాలు వారి వారి కుటుంబ సభ్యులకు మృత దేహాలతో పాటు తక్షణ సాయం రూ.లక్ష అందజేశామన్నారు.

తాత్కాలిక ఆర్థిక సహాయం

18 మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, గాయపడిన 34 మందికి రూ.50 వేలు చొప్పున, మిస్సింగ్ అయిన 10 మంది కార్మికుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున తాత్కాలిక సహాయం అందించడం జరుగుతోందన్నారు. బాధిత కుటుంబాలు లేదా వారి బంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08455276155ను సంప్రదించవచ్చు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా వారి అవసరాలపై సత్వర స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు


చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకుంటుందని ఐసీడీఎస్ పీడీ హైమావతి అన్నారు. బుధవారం మండలంలోని శేరీల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. చిన్నారుల వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉన్నారా..? అని పరిశీలించారు. అనంతరం శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండదని, భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవనం నిర్మించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఆమె వెంట టీచర్ దేవలత, సిబ్బంది ఉన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి: డీపీఓ


రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఓ యాదయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షాకాలం గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని డీపీఓ యాదయ్య తెలిపారు. బుధవారం కౌడిపల్లి పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామం సంపూర్ణ పారిశుద్ధ్యంగా ఉండేలా చూడాలన్నారు. మురికి నీరు, చెత్త లేకుండా చూడాలని, రక్షిత తాగునీటి పథకంలో పైపులైన్ లీకేజీలు ఉంటే సరిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం ఉన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు బాగుంది


మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ. 5 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయ భవనాన్ని అదనపు కలెక్టర్ నగేష్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం బాగుందన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. గ్రంథాలయానికి సొంత భవనం కేటాయించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, పీఆర్ ఏఈ మారుతి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

కొల్చారం/నర్సాపూర్ రూరల్: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎలాంటి అపోహకు గురికావొద్దని సూచించారు. అలాగే నర్సాపూర్ మండలంలోని ఇబ్రహీంబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాజిరెడ్డి భూమి పూజ చేశారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యాదగౌడ్, రామగౌడ్, నరేష్, బీమ్, రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్‌పై ప్రత్యేక దృష్టి

ఫలితాల్లో ఈసారి మొదటి స్థానం దక్కాలి

- ఆ దిశగా విద్యాబోధన సాగాలి
- ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ఈసారి పది, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానం రావాలని, ఆ దిశగా విద్యాబోధన సాగాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నమోదు సంఖ్య పెంచాలన్నారు. అలాగే డ్రాపౌట్ సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల నమోదును పెంచుతూ డ్రాపౌట్స్ కారణాలను గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించడం, డ్రాపౌట్స్‌పై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఉన్నతమైన విద్యా ప్రమాణాలతో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాలు మరింత మెరుగుపడే దిశగా కృషి చేయాలన్నారు. కష్టమైన సబ్జెక్టులపై, విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. పది పాసైన విద్యార్థులను ఇంటర్‌లో చేరేలా, ఇంటర్ పాసైన వారిని డిగ్రీలో తప్పనిసరిగా చేరేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం పటిష్ట కార్యాచరణ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు, సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే ప్రతి విద్యార్థికి చదువు ప్రాముఖ్యత తెలియజెప్పాలన్నారు. గ్రామీణ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందించాలన్నారు. సమావేశంలో డీఈఓ రాధాకిషన్, ఇంటర్ విద్యాశాఖ అధికారి మాధవి, నోడల్ అధికారులు ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఇరిగేషన్ అదనపు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రప్రసాద్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'సాంస్కృతిక' సలహాదారుగా అంజన్న

దుబ్బాకటౌన్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారు కమిటీ సభ్యుడిగా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న నియామకమయ్యారు.

నేల కూలిన భారీ వృక్షం

తప్పిన ప్రమాదం



తూప్రాన్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న భారీ వృక్షం బుధవారం నేలకూలింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా పార్కింగ్ చేసిన బైక్‌లు, ఆటో, రిక్షాలు దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు చేపట్టి చెట్టును తొలగించారు.


సింగూరు జలాశయం

సింగూరులోకి వరద

1,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సింగూరు డ్యామ్‌లోకి వరద చేరుతోంది. బుధవారం 1,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరంతా మంజీరా నది ద్వారా, మునిపల్లి మండలం దుబ్బవాగు ద్వారా డ్యాంలోకి నీరు చేరుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.219 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు టీఎంసీల నీరు చేరిందని అధికారులు తెలిపారు. డ్యామ్ ఎగువ భాగం మహారాష్ట్రలోని లాతూర్‌లో కురుస్తున్న వర్షం డ్యామ్‌లోకి చేరుతుందని అధికారులు తెలిపారు.

సర్కార్ బడికే సై..



బడిబాట కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటూ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చేసిన ప్రచారం ఫలించింది. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 834 మంది పిల్లలు అధికంగా చేరారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

– మెదక్‌జోన్

సత్ఫలితాలిచ్చిన బడిబాట

- గతేడాది కంటే పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ఈ ఏడాది 5,742 మంది చేరిక

జిల్లావ్యాప్తంగా 926 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కాగా వీటిలో గత సంవత్సరం బడిబాటలో భాగంగా 4,908 పిల్లలు చేరగా, ఈ ఏడాది 5,742 మంది పిల్లలు కొత్తగా చేరారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 74,529లకు చేరింది. కాగా ఏటా జూన్‌లో 15 రోజుల పాటు బడిబాట కార్యక్రమం నిర్వహించేది. ఈసారి మాత్రం ముందస్తుగా ఉపాధ్యాయులు మే నెలలోనే నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారి కృషి ఫలితంగా ఈ సారి విద్యార్థుల సంఖ్య పెరిగింది. అంతేకాకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వం వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

టీచర్ల పిల్లలు సైతం..

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే 25 మంది ఉపాధ్యాయులు వారి పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మార్పుకు నాంది పలికారు. వీరిని ఆదర్శంగా తీసుకున్న పేద, మధ్య తరగతి వారు సైతం వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లోకి పంపుతున్నారు. ప్రభుత్వ టీచర్లు వారి పిల్లలను సర్కారు బడుల్లోనే చదివించాలనే నిబంధన తీసుకొస్తే పేద, మధ్య తరగతి వారంతా వారి పిల్లలను ప్రైవేట్‌కు పంపకుండా సర్కార్ బడులకే పంపిస్తారని పలువురు పేర్కొంటున్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్‌జోన్: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో రూ. 3.65 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి కోసం రూ. 30 కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే రూ. 3.65 కోట్లతో శభాష్‌నగర్, వెంకట్రావ్‌నగర్ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామన్నారు. అంతకుముందు మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు రూ. 3.53 కోట్ల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


ఎస్‌హెచ్‌జీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

క్లుప్తంగా

రూ.4 వేలతో 4 పుణ్యక్షేత్రాల యాత్ర

డిపో మేనేజర్ రఘు

దుబ్బాకటౌన్: దుబ్బాక నుంచి అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని దుబ్బాక డిపో మేనేజర్ రఘు బుధవారం తెలిపారు. ఈ నెల 9న సాయంత్రం 3 గంటలకు దుబ్బాక నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరి ప్రదర్శణాంతరం తిరుపతి దర్శణం ఉంటుందని పేర్కొన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.4 వేలు, పిల్లలకు రూ.2 వేలు ఉంటుందని చెప్పారు. టికెట్ బుకింగ్ కోసం 9959 226271, 7382 829973 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

శ్రీనివాసమూర్తికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న శ్రీనివాసమూర్తి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడు, పురోహితుడు దైవజ్ఞ శ్రీనివాసమూర్తి పంతులుకు చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. గతనెల 28న చైన్నైలోని మైలాపూర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన సభలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా శ్రీనివాసమూర్తి గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 20 ఏళ్లుగా పురోహితునిగా జ్యోతిష్య, వాస్తు శాస్త్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను పట్టాను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వీసీ, మాజీ జడ్జి కే.వెంకటేషన్, చీఫ్ జనరల్ మేనేజర్ హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్ ఆటమిక్ ఎనర్జీ ఎస్ సెల్వరాజన్, ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ గణేషన్, ప్రముఖులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పాపన్నపేట(మెదక్): నాగ్సాన్‌పల్లి శివారులో మంగళవారం రాత్రి జూదం ఆడుతున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామ శివారులోని ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్‌పై కానిస్టేబుల్స్‌తో కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న వారి అరెస్ట్ చేశారు. ఒకరు పారిపోయారు. వారి నుంచి రూ.74,350 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, రెండు కార్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మేకల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మేకలను అపహరిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మల్లారెడ్డిపల్లిలో నాలుగు మేకల చోరీ కేసులో హైదరాబాద్‌కు చెందిన నీరజ్‌కుమార్, నరేష్‌కుమార్, మాఖన్ విశాల్‌సింగ్‌లు మూడు నెలల క్రితం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించగా, ఇదే కేసులో మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం వర్గల్ కమాన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌కు చెందిన సూర్యవంశీ రాహుల్, ధరంకార్ గోపాలకృష్ణ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. మేకల షెడ్‌లను వెతికేందుకు గౌరారం వచ్చినట్లు, గౌరారంతో పాటు తొగుట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మేకలను దొంగిలించినట్లు అంగీకరించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు.

మార్చురీ వద్ద పడిగాపులు

విలపిస్తున్న బాధిత కుటుంబాలు



తుండు కోసం వచ్చిన బెంగాల్ రాష్ట్ర వాసులు



మార్చురీ వద్ద విలపిస్తున్న డీజీఎం ప్రవీణ్ బంధువులు



సెల్‌ఫోన్‌లో కుమారుడి ఫొటో చూపుతూ రోదిస్తున్న శంభు

రామచంద్రాపురం/పటాన్‌చెరు టౌన్: సిగాచీ పరిశ్రమలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలు తమ వారి మృతదేహాల కోసం ఎదురుచూస్తున్నారు. పటాన్‌చెరు ఆస్పత్రి ప్రాంగణంలో మార్చురీ వద్ద బాధిత కుటుంబీకులు బుధవారం ఎదురు చూస్తూ కనిపించారు. మృతదేహాలను వెతుకుతూ కన్నీటి పర్యంతమయ్యారు.

సర్పంచ్ సాయంతో విమానంలో వచ్చి...

జుమ్రత్‌మియా జార్ఖండ్ నుంచి పటాన్ చెరు ఆస్పత్రికి వచ్చారు. ఆయన కుమారుడు ఇటీవల పరిశ్రమలో కార్మికునిగా చేరాడని ప్రమాదంలో చనిపోయాడని చెప్పాడు. అయితే తన కుమారుని భౌతికకాయం మార్చురీలో ఉందంటే వచ్చినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ సహకారంతో మంగళవారం పటాన్‌చెరుకు విమానంలో చేరుకున్నాడు. బుధవారం సాయంత్రం వరకు కూడా మృతదేహం ఆయనకు ఇవ్వలేదు. ఈ సందర్భంగా జుమ్రత్ మియా అధికారులతో మాట్లాడుతూ తన కుమారుడు భౌతికకాయాన్ని ఇప్పించాలని అధికారులు వేడుకున్నారు.

పనిచేసి నెల రోజులే..

శివ్ జీ అనే కార్మికుడు బీహార్ నుంచి వచ్చి ఈ పరిశ్రమలో నెల రోజులు కూడా పనిచేయలేదు. అంతలోనే ప్రమాదం జరిగి అనంత లోకాలకు వెళ్లాడనీ శివ్‌జీ తండ్రి శంభు బిందు రోదిస్తూ చెప్పాడు. భౌతిక కాయం కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పాడు.

తరలి వచ్చిన బెంగాల్ గ్రామస్తులు

అసీం తుండు అనే కార్మికుడి జాడ కోసం హరిరాజ్‌పూర్ గ్రామానికి చెందిన వారు కదిలి వచ్చారు. ఆ కార్మికుడి కోసం తాము రెండు రోజులుగా వెతుకుతున్నామని చెప్పారు. అధికారులు తమకు అసీం భౌతికకాయాన్ని ఇప్పటివరకు చూపలేదని వాపోయారు.

మిన్నంటిన రోదనలు

పటాన్ చెరు మార్చురీ వద్ద తమ వారి భౌతిక కాయాలను తీసుకెళ్తూ కుటుంబీకులు బోరును విలపించారు. పరిశ్రమలో డీజీఎంగా పనిచేస్తున్న ప్రవీణ్ ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు భౌతిక కాయాన్ని చూసి శోక సంద్రంలో మునిగిపోయారు. అధికారులు భౌతిక కాయాలను గుర్తించిన వారికి తక్షణం ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు ఇచ్చి వాహనాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

బీహార్ నుంచి కొడుకు కోసం..



నా కుమారుడు మునుమున్ చౌదరి బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం వచ్చి ఇస్నాపూర్‌లో ఉంటూ, సిగాచీ పరిశ్రమలో తొమ్మిదేళ్లుగా సీనియర్ ఆపరేటర్‌గా క్వాలిటీ సెల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం విధులకు వెళ్లిన కొద్దిసేపటికే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని తెలిసింది. దీంతో మా మనవడు సోను చౌదరి నాకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో కొడుకుని చూసేందుకు బీహార్ నుంచి బుధవారం ఉదయం ధ్రువ ఆస్పత్రికి వచ్చాను. ప్రస్తుతం నా కుమారుడికి వెంటిలేటర్‌పై వైద్యం చేస్తున్నారు.

–పుల్ సుందర్ దేవి, బీహార్

ఫస్ట్ షిఫ్ట్ వెళ్లిన కొద్ది గంటల్లోనే..



సోమవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లాడు. వెళ్లిన కొద్దిసేటికే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని తెలిసింది. తెలిసిన వెంటనే పరిశ్రమ వద్దకు వెళ్లి నా భర్త ఆచూకీ కోసం వెతుకుతుండగా, ధ్రువ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం నా భర్త అఖిలేశ్వర్ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.

– షర్మిల, ఉత్తర్‌ప్రదేశ్

వీవోఏ ఆత్మహత్య కారకులను శిక్షించాలి

- విచారణ జరిపి డబ్బులు రికవరీ చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీకి ఫిర్యాదు



అదనపు ఎస్పీ మహేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: వీఓఏ పద్మ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి, విచారణ జరిపి డబ్బులు రికవరీ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నాగమణి మాట్లాడారు. పోడ్చన్‌పల్లి వీవోఏ పద్మ రాసిన సూసైడ్ నోట్‌లో నిజం ఉందన్నారు. ఆమె చావుకు కారణమైన అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి ద్వారానే డబ్బులు రికవరీ చేయించాలన్నారు. అధికారులు పద్మను బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి ఐదేళ్లుగా డ్వాక్రా గ్రూపు నుంచి డబ్బులు స్వాహా చేశారని ఆరోపించారు. కానీ అసలు విషయం గ్రామ ప్రజలకు తెలియదన్నారు. డబ్బులు స్కాంలో బ్యాంకు, ఆడిట్ అధికారులతోపాటు ఏపీఎం ప్రమేయం ఉందని గుర్తు చేశారు. లక్షల రూపాయలు దండుకొని కుంభకోణాన్ని పద్మమీదకు నెట్టారని మండిపడ్డారు. జిల్లాలో 517 గ్రామ సమైక్య సంఘాలు, 13,079 డ్వాక్రా గ్రూపులు, 1,56,942 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ జరిపించాలన్నారు.

చెరువులో మహిళ మృతదేహం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ వెంకటేష్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాజీపేట లక్ష్మి(55) గత నెల 30 నుంచి కనబడటం లేదు. దీంతోపాటు ఆమె ఆరోగ్యం కూగా బాగాలేదు. ఉదయం గ్రామ శివారులోని రావుల చెరువులో ఆమె మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి వారెంట్ జారీ

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన కల్లూరి శ్రవణ్ అనే నిందితుడికి బుధవారం వారెంట్ ఇష్యూ అయింది. ఏఎస్ఐ శంకర్‌రావు కథనం మేరకు... 2014లో అతనిపై నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కోర్టుకు హాజరు కానందున సిద్దిపేట సెషన్స్ కోర్టు జడ్జి ఈనెల 7వ తేదీన హాజరుకావాలని వారెంట్ జారీ చేశారు.

విత్తనాల సమాచారం చెప్పడం లేదంటూ..

పెట్రోలు డబ్బాతో రైతు హల్‌చల్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత విత్తనాలు తమకు అందడం లేదంటూ రైతు నిరసన వ్యక్తం చేశాడు. మండల పరిధిలోని చీకూర్తి గ్రామానికి చెందిన రైతు రమేష్ పెట్రోల్ బాటిల్‌తో బుధవారం హల్‌చల్ సృష్టించాడు. న్యాల్‌కల్‌కు వచ్చిన అతడు పెట్రోల్ తీసుకొని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాడు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత విత్తనాల సమాచారం చెప్పడం లేదంటూ కార్యాలయం ఆవరణలో ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి అక్కడకు చేరుకొని అధికారులతో మాట్లాడారు. రమేష్‌కు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు. ఈ విషయాన్ని ఏఓ అభినాష్ వర్మ దృష్టికి తీసుకెళ్లగా, కంది, పెసర, సోయాబీన్ విత్తనాలు వచ్చాయని గురువారం పంపిణీ చేస్తామని తెలిపారు.

వదినపై మరిది లైంగికదాడి

మెదక్ జిల్లాలో ఘటన

పాపన్నపేట(మెదక్): వావి వరసలు మరిచిన ఓ వ్యక్తి వదినపై లైంగికదాడికి ఒడి గట్టాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... మెదక్ చెందిన ఓ యువతికి 14 యేళ్ల క్రితం వివాహం జరగగా ఓ కూతురు జన్మించింది. కొన్ని కారణాల వల్ల 2013లో భర్తతో విడాకులు తీసుకొని తల్లి గారింటి వద్ద ఉంటుంది. ఇటీవల తల్లిగారి ఇంటికి వచ్చిన తన చెల్లిని ఆమె అత్తగారి ఇంటి వద్ద దిగబెట్టడానికి బాధితురాలు మంగళవారం వెళ్లింది. అదే రోజు తిరుగు ప్రయాణంలో వదినను మెదక్‌లో దిగబెట్టి వస్తానని చెప్పి మరిది (చెల్లెలి భర్త) బైక్‌పై తీసుకెళ్లాడు. ఏడుపాయల కమాన్ వద్దకు రాగానే అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఆమెను భయపెట్టి లైంగికదాడి చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఇంటికి వెళ్లిన తర్వాత బాధితురాలు జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. వారిద్దరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం



అనసూజ

సంగారెడ్డి క్రైమ్: మతి స్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... అందోల్ మండలం మాసన్‌పల్లి గ్రామానికి చెందిన రొయ్యల అనసూజ(50) అనారోగ్యం నిమిత్తం ఈనెల 1న ఉదయం పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసించే తన కుతురు నాగలక్ష్మి ఇంటికి వచ్చింది. అదే రోజు సాయంత్రం 5 గంటల సమయంలో పాల ప్యాకెట్ తీసుకొస్తానని ఇంట్లో చెప్పి, బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇందిరమ్మ ఇల్లు ఇస్తారా.. చావ మంటారా!

చాట్లపల్లిలో పురుగుల మందు డబ్బాతో నిరసన



గ్రామ పంచాయతీ ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన చేస్తున్న దంపతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఓ పేద కుటుంబం పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపింది. ఈ ఘటన మండలంలోని చాట్లపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు... గ్రామానికి 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. బుధవారం గ్రామ కార్యదర్శి సాయిబాబాతోపాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసేందుకు వెళ్లారు. గ్రామానికి చెందిన స్వప్న రమేష్ దంపతులు తమది పేద కుటుంబమని, అన్ని అర్హతలు ఉన్నా.. మొదటి విడతలో ఇల్లు రాలేదని తెలిపారు. తమ పేరు ఎందుకు రాయలేదని అక్కడికి వచ్చిన అధికారులు, కమిటీ సభ్యులను నిలదీశారు. ఇల్లు మంజూరు చేయకుంటే ఇక్కడే పురుగుల మందు తాగుతామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో దంపతులిద్దరూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దంపతులను సముదాయించారు. అనంతరం ఎంపీడీఓ రాంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రెండో విడతలో ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

దుబ్బాక : గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బాలాజీ టెంపుల్ వద్ద వెంచర్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ గంగరాజు సిబ్బందితో కలిసి రైడ్ చేశారు. నలుగురు యువకులు పోలీసులను చూసి గంజాయి పడేస్తూ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. నిందితులు ఒకరు ఒడిశాకు చెందిన వారు కాగా ప్రస్తుతం దుబ్బాకలో ఉంటున్న మహ్మద్ అజారుద్దీన్, దుబ్బాకకు చెందిన పోతరాజు సింహాద్రి, తోర్నాలకు చెందిన పల్లటి దినేష్, మాడుగుల నరహరిని విచారించగా ఒడిశాలో కొనుగోలు చేశామని అంగీకరించారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్ఐ గంగరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

6న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న జిల్లా జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు సభ్యుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి అక్బర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక ఫుట్‌బాల్ మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బాలికల జూనియర్ జట్టు కోసం ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో ఈనెల 6న ఉదయం హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9న ఆదిలాబాద్‌లో జరగనున్న జూనియర్ బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9885 789008, 9989 484657 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయిలో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. గత నెల 28, 29 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో 46 కిలోల విభాగంలో 8వ తరగతి చదువుతున్న ఆర్ చందన సిల్వర్ మెడల్, 32 కిలోల విభాగంలో 8వ తరగతి చదువుతున్న జ్యోష్న సిల్వర్ మెడల్, 50 కేజీల మ్యూజికల్ పామ్ విభాగంలో ఇంటర్ విద్యార్థి మధులత బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను, పీఈటీ చారిని ఉపాధ్యాయుల బృందం అభినందించింది.

జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపిక



సేవారత్న అవార్డు ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న పాస్టర్ ప్రశాంత్ బెంజిమెన్

న్యాల్‌కల్(జహీరాబాద్): జాతీయ ఉత్తమ సేవా అవార్డుకు మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో గల చర్చి పాస్టర్ ప్రశాంత్ బెంజిమెన్ ఎంపికయ్యాడు. బుధవారం ఈ మేరకు హైదరాబాద్‌లో అవార్డు సెలెక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ ఎంపిక పత్రాన్ని ఆయనకు అందజేశారు. సెప్టెంబర్ 5వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో సేవారత్న అవార్డును అందజేయనున్నారు. నిస్వార్థంగా స్వచ్ఛంద సేవ, సంఘ సేవలను కుల, మతాలకు అతీతంగా అందిస్తున్నందుకు గాను ఎంపిక చేసినట్లు రాధాకృష్ణ పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్

ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్ష్మీనారాయణ

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా... మండలంలోని అక్కన్నపేటకు చెందిన కొత్తేనుగు లక్ష్మీనారాయణ (55) కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం జంగంపల్లివద్ద ఉన్న ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. బుధవారం వ్యక్తిగత పనుల కోసం అక్కన్నపేట గ్రామానికి బైక్‌పై వచ్చి మధ్యాహ్నం తిరిగి వెళ్తున్న క్రమంలో బిక్కనూరు చర్చి సమీపంలో జాతీయ రహదారిపై వెనుకనుంచి కంటైనర్ ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు గతంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు.

సబ్సిడీ కందుల బ్యాగులు పంపిణీ



రైతులకు కందుల బ్యాగులను అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్: వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు వేదికలో సబ్సిడీపై కందుల బ్యాగులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుల సాగు చేయడం వల్ల ఎకరానికి 6క్వింటాళ్ల పైగా దిగుబడి వస్తుందన్నారు. మార్కెట్‌లో పప్పు దినుసులకు డిమాండ్ ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో భూములు ఎక్కువగా ఉన్న రైతులు ఆయిల్ పామ్‌ను సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ చందు, డైరెక్టర్లు యాదవ రెడ్డి, బిక్యా నాయక్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం ఇవ్వాలి

- కామన్ మెనూను అమలు చేయాలి
- కలెక్టర్ కె.హైమావతి
- మిట్టపల్లి గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటఅర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు కామన్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ కె.హైమావతి సూచించారు. బుధవారం సాయంత్రం అర్బన్ మండలం మిట్టపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించి డైలీ స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి రోజువారీగా తీసుకునే సామగ్రిని తూకం వేసి పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో వంట సిబ్బంది తప్ప వార్డెన్ కానీ ఇతర సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కామన్ మెనూ ప్రకారం బ్రేక్‌ఫాస్ట్‌లో పులిహోర, మధ్యాహ్నం చికెన్ కర్రీ, సాయంత్రం టీ, టమాటా పప్పు, పప్పుచారు చేసినట్టు వంట సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టమాటా పప్పు రుచి మెరుగుపరచాలని, ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ఒక్కో విద్యార్థికి ఎంతో డబ్బు ఖర్చు చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ నుంచి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ విద్యార్థులను తమ సొంత పిల్లల్లాగా అన్ని సదుపాయాలు కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టడీ అవర్ కొనసాగుతుండటంతో ప్రతి తరగతి విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి శ్రద్ధగా చదువుకోవాలని, ఆటలు బాగా ఆడాలన్నారు. గురుకులంలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదుల్లో వెలుతురు సరిగా లేదని, ట్యూబ్‌లైట్లు మరిన్ని ఏర్పాటు చేసి, ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Sri Padmavathi School of Nursing Recognised by T.G. NMC, Hyderabad & Govt. of T.G, Sanga Reddy Town & Dist. Pin-502001, GNM Staff Nurse Course Management Seats Available Contact: 9154513999, 8309389464 [H-1028418]

WANTED

రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥ బో+వసతి + జీతం: 16–18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011 [SCA25005822]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.